796) వసంత వరాళి

ప॥ నిలు నిలు దగ్గరకు నీయాన నీకు । వలచితినని మావారెల్లనగరా ॥

చ॥ వద్దు వద్దు కొండలలో వారికి మాకింతేసి । పెద్ద పెద్ద ముత్యాల పేరులిన్నేసి ।
అద్దము చూచిదె మాకు నంతకంటె సిగ్గయ్యీని । గద్దరి మాచెంచువారుగని నన్ను నగరా ॥

చ॥ చాలు జాలు బంగారు సరుపణులుంగరాలు । నీలపుగంటసరులు నీకే ఉండనీ ।
మూలనుండే వారుగాక ముత్యాలచెరగుల । చేలగట్టు కొన్న నన్ను చెంచెతలు నగరా ॥

చ॥ రాకు రాకు యీడకు నీరమణుల పాదమాన । నాకు నీకు నింతేసి ననుపేటికి ।
దీకొని కూడితి నన్ను తిరువేంకటేశ యీ- । కాకరిచేతలకు లోకమువారు నగరా ॥